నర్సింగ్ కాలేజీపై మంత్రి పొన్నం ఆరా

- హైదరాబాద్ వెళ్లిన మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, దవాఖాన సూపరింటెండెంట్
- అప్‌గ్రేడేషన్ గురించి చర్చ
- కరీంనగర్‌కు వచ్చినప్పుడు పూర్తి వివరాలు ఇవ్వాలని అమాత్యుడి ఆదేశం

హైదరాబాద్‌లో మంత్రి పొన్నంను కలిసిన ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్

నమస్తే ఎఫెక్ట్

కరీంనగర్ నర్సింగ్ స్కూల్ అప్‌గ్రేడేషన్‌కు సంబంధించి 'నర్సింగ్ కాలేజీపై నీలినీడలు' శీర్షికన శుక్రవారం 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన కథనానికి మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ వీరారెడ్డి హుటాహుటిన హైదరాబాద్ వెళ్లి విషయం చెప్పడంతో ఏం జరిగిందంటూ ఆరా తీశారు. త్వరలోనే కరీంనగర్ వస్తానని, చర్చించి నిర్ణయం తీసుకుందామని చెప్పారు.

కరీంనగర్ విద్యానగర్, జనవరి 19 : కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన దవాఖానకు అనుబంధంగా 2013-14లో అప్పటి ప్రభుత్వం నర్సింగ్ స్కూల్‌ను మంజూరు చేసింది. దీంతో కలిపి రాష్ట్రంలో ఏర్పాటు చేసిన నర్సింగ్ స్కూళ్ల సంఖ్య ఆరుకు చేరింది. అయితే కరీంనగర్ మినహా మిగతా ఐదింటిని కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేయడంపై గురువారం హైదరాబాద్‌లో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) కార్యాలయంలో సమావేశం జరిగింది. నర్సింగ్ స్కూల్‌కు మంజూరైన ₹3.32 కోట్లకు సంబంధించిన వినియోగపత్రాన్ని ఇవ్వలేదన్న కారణంతో ఇక్కడి ప్రిన్సిపాల్‌కు మీటింగ్ సమాచారం ఇవ్వకుండా విస్మరించినట్టు తెలిసింది. 'నమస్తే తెలంగాణ' ఈ విషయాన్ని వెలుగులోకి తెచ్చింది. 'నర్సింగ్ కాలేజీపై నీలినీడలు' శీర్షికన శుక్రవారం సమగ్ర కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ శీల లక్ష్మీనారాయణ, ప్రభుత్వ ప్రధాన దవాఖాన సూపరింటెండెంట్ వీరారెడ్డి స్పందించారు. నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ రమాబాయి నుంచి వివరాలు తీసుకున్నారు. ఈ విషయాన్ని ఫోన్‌లో రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆ వెంటే హైదరాబాద్ వెళ్లి ఆయనను కలిసి, నర్సింగ్ స్కూల్ అప్‌గ్రేడ్, మెడికల్ కాలేజీ సమస్యలను ప్రస్తావించారు. త్వరలోనే కరీంనగర్‌కు వస్తానని, అక్కడ పూర్తి స్థాయిలో చర్చించి తదుపరి చర్యలు తీసుకుందామని వారికి మంత్రి చెప్పారు. ఆమేరకు అమాత్యుడికి సమగ్ర నివేదిక ఇచ్చేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

సదరం సర్టిఫికెట్ కోసం ₹15 వేలు వసూలు

- ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి చేతివాటం
- సూపరింటెండెంట్‌కు బాధితుడి ఫిర్యాదు

కరీంనగర్ విద్యానగర్, జనవరి 19 : కరీంనగర్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్)లో నిర్వహిస్తున్న సదరం శిబిరంలో కొందరు చేతివాటం ప్రదర్శిస్తూనే ఉన్నారు. గతంలో వచ్చిన ఆరోపణ నేపథ్యంలో దవాఖాన సూపరింటెండెంట్ ప్రత్యేక దృష్టి సారించినా.. అక్రమ వసూళ్లకు పాల్పడుతూనే ఉన్నారు. తాజాగా ఇలాంటి ఘటనే వెలుగులోకి వచ్చింది. ఈఎన్‌టీ విభాగంలో పనిచేస్తున్న ఓ కాంట్రాక్టు ఉద్యోగి సదరం సర్టిఫికెట్ ఇప్పిస్తానంటూ ₹15 వేలు తీసుకొని మోసం చేశాడంటూ ఆరోగ్యశ్రీ డాటా ఎంట్రీ ఆపరేటర్ శుక్రవారం సూపరింటెండెంట్ వీరారెడ్డికి ఫిర్యాదు చేశాడు. వసూళ్లపై సదరు కాంట్రాక్టు ఉద్యోగిని వివరణ కోరేందుకు సూపరింటెండెంట్ ప్రయత్నించగా, ఆ వ్యక్తి ఇష్టానుసారం మాట్లాడడమే కాకుండా.. ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరించడం కలకలం రేపింది. పశ్చాత్తాపం చెంది సమాధానం ఇవ్వాల్సిందిపోయి.. వైద్యులు, అధ్యాపకులు, బాధితుల ముందే అసభ్య పదజాలాన్ని ఉపయోగిస్తూ తనపై బెదిరింపులకు పాల్పడడంతో సూపరింటెండెంట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, గతంలో సదరం శిబిరాల్లో జరిగిన అక్రమాలు పునరావృతం కాకుండా చూసేందుకు ఇటీవల సూపరింటెండెంట్ ప్రత్యేక దృష్టి సారించారు. సంబంధిత సిబ్బంది అక్రమాలకు పాల్పడకుండా ఉండేలా కఠిన చర్యలు తీసుకుంటున్నారు. సదరం శిబిరానికి వచ్చే వారు నేరుగా హాజరై సర్టిఫికెట్లు పొందాలని, దవాఖాన సిబ్బందికి గానీ, ఇంకెవరికైనా గానీ డబ్బులు ఇవ్వవద్దని ఆయన సూచించారు. ఎవరైనా అడిగితే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు.

మహిళలు రాజకీయాల్లో రాణించాలి

- రిజర్వేషన్ ఫలాలను అందిపుచ్చుకోవాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్
- బల్దియాలో మహిళా కార్పొరేటర్ల చాంబర్ ప్రారంభం

నగరపాలక సంస్థ కార్యాలయంలో మహిళా కార్పొరేటర్ల కోసం ఏర్పాటు చేసిన చాంబర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంగుల

కార్పొరేషన్, జనవరి 19: పురుషులకు దీటుగా మహిళలు రాజకీయాల్లో రాణించాలని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్‌ను కల్పించిన ఘనత కేసీఆర్ సర్కారుకే దక్కిందన్నారు. అతివలు ఈ ఫలాలను అందిపుచ్చుకొని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. కరీంనగర్ కార్పొరేషన్ కార్యాలయంలో మహిళా కార్పొరేటర్ల కోసం ఏర్పాటు చేసిన చాంబర్‌ను మేయర్ యాదగిరి సునీల్‌రావుతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళల కోసం ప్రత్యేకంగా చాంబర్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మహిళా కార్పొరేటర్లు తమకు కేటాయించిన గదిలో ప్రజలను కలుసుకోవాలని సూచించారు. ఇక్కడ డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి, అడిషినల్ కమిషనర్ స్వరూపరాణి, కార్పొరేటర్లు, అధికారులు ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించండి

- ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల

మారుతీనగర్, జనవరి,19 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల సూచించారు. ఈ మేరకు శుక్రవారం మెట్‌పల్లి పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులతోపాటు భోజనశాల, వంటగదులను పరిశీలించారు. పాఠశాలల్లో అడ్మిషన్ల విషయమై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రిన్సిపాల్ సంతోషినికి సూచించారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

జైలు సోపతులు.. వరుస చోరీలు

- ఆలయాలే టార్గెట్
- తాజాగా ముగ్గురి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్

మెట్‌పల్లి రూరల్, జనవరి 19 : ఆ ముగ్గురు జైలులో సోపతులయ్యారు. జైలు నుంచి వచ్చిన తర్వాత కలిశారు. ఈజీగా డబ్బులు సంపాదించాలన్న ఆలోచనతో ఆలయాలే టార్గెట్‌గా చోరీలు చేశారు. తాజాగా పోలీసులకు చిక్కారు. మెట్‌పల్లి ఠాణాలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రవీందర్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. మెట్‌పల్లికి చెందిన షేక్ హైదర్, నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌కు చెందిన ఎర్ర వెంకటి, కొర్వ సంతోష్‌కు ఆరు నెలల క్రితం కరీంనగర్ జైలులో పరిచయం ఏర్పడింది. గత జూలైలో జైలు నుంచి విడుదలైన ఈ ముగ్గురు, ఆలయాల్లో చోరీలు చేయాలని స్కెచ్ వేశారు. రెండు నెలల క్రితం మెట్‌పల్లి మండలం జగ్గసాగర్ సాయిబాబా ఆలయంలోని హుండీ, పదిహేను రోజుల క్రితం కోరుట్ల ఎల్లమ్మ గుడిలో హుండీని ఎత్తుకెళ్లారు. నాలుగు రోజుల క్రితం కోరుట్ల మండలం ధర్మారం రామాలయంలోని హుండీ పగులగొట్టి నగదును దొంగిలించారు. రెండు రోజుల క్రితం మెట్‌పల్లి మండలం రామలచ్చక్కపేట శివాలయం, జగ్గసాగర్ రామాలయం, గంగమ్మ ఆలయం, ఆత్మనగర్‌లోని మల్లన్నగుడి, హనుమాన్ ఆలయాల్లో చోరీకి పాల్పడ్డారు. దీంతో ఫిర్యాదులు వెల్లువెత్తగా, పోలీసులు గాలింపు చేపట్టారు. శుక్రవారం ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీ వద్ద ముగ్గురు నిందితులను పట్టుకొని అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి ₹9 వేల నగదు, 14 తులాల వెండి, బైక్ తోపాటు తాళాలు పగులగొట్టడానికి ఉపయోగించిన కొంకి స్వాధీనం చేసుకున్నారు. దొంగలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుళ్లు కిరణ్, సంతోష్‌కు రివార్డులు ప్రకటించారు. ఇక్కడ మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ, మెట్‌పల్లి, మల్లాపూర్ ఎస్ఐలు చిరంజీవి, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

అధిక వడ్డీ ఆశపెట్టి.. ₹50కోట్లకు టోకరా

- గోదావరిఖనిలో కిరాణా వ్యాపారి ఘరానా మోసం
- ఒకరికి తెలియకుండా మరొకరి వద్ద అప్పులు
- గుట్టుచప్పుడు కాకుండా ఉడాయింపు
- ఖని ఠాణాలో 50 మంది బాధితుల ఫిర్యాదు

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 19: అధిక శాతానికి మిత్తి ఇస్తానని చెప్పి ఒకరికి తెలియకుండా మరొకరి వద్ద ₹5 కోట్ల దాకా అప్పులు చేశాడు. గుట్టు చప్పుడు కాకుండా ఇంటిని విక్రయించి రాత్రికిరాత్రే పరారయ్యాడు. ఈ హఠాత్పరిణామంతో నిశ్చేష్టులైన 50 మంది బాధితులు గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం ప్రకారం.. గోదావరిఖని తిలక్‌నగర్‌కు చెందిన ఓ వ్యాపారి స్థానికంగా కిరాణా దుకాణం నిర్వహించేవాడు. గిరాకీ కూడా బాగా ఉండేది. ఈ క్రమంలో తన వ్యాపారం బాగా నడుస్తున్నదని, అధిక వడ్డీ ఇస్తానని నమ్మబలికి సుమారు 50 మంది వద్ద ₹5 కోట్ల వరకు అప్పులు చేశాడు. పక్కా ప్రణాళికా ప్రకారం ఇటీవలే సొంతింటిని విక్రయించాడు. మూడు రోజుల క్రితం రాత్రికిరాత్రే ఉడాయించాడు. కాగా, బాధితులు ఖని వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు వివరాలు సేకరించారు.

కోరుట్ల కేంద్రంగా నకిలీ పాస్‌పోర్టుల రాకెట్

- విదేశీయులకు సైతం ఇక్కడి చిరునామాలు!
- బంగ్లాదేశ్, శ్రీలంక వాసులకు సైతం పాస్‌పోర్టులు
- బోగస్ ఆధార్, స్థానిక ధ్రువీకరణ పత్రాలతో తయారీ
- అధికారులు సహకరించారనే ఆరోపణలు
- కొన్నాళ్లుగా వెల్లువెత్తిన ఫిర్యాదులు
- సీఐడీ ఆకస్మిక దాడులతో వెలుగులోకి దందా
- స్టాంపులు, పలు బోగస్ పత్రాలు స్వాధీనం
- ఏడుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

కోరుట్లలో సోదాల అనంతరం వెళ్తున్న అధికారులు

కోరుట్ల కేంద్రంగా భారీ నకిలీ పాస్ పోర్టుల కుంభకోణం వెలుగులోకి వస్తున్నది. ఒకటి కాదు.. రెండు కాదు, వందలాది పాస్‌పోర్టులు ఇక్కడి చిరునామాలపైనే జారీ కావడం సంచలనం రేపుతున్నది. గల్ఫ్ ఏజెంట్లు సాగించిన ఈ దందాలో బంగ్లాదేశ్, శ్రీలంక వాసులకు సైతం ఇచ్చినట్టు తెలుస్తున్నది. కొన్నాళ్ల నుంచి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో హైదరాబాద్ సీఐడీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, శుక్రవారం నాలుగు బృందాలుగా ఏర్పడి చేసిన ఆకస్మిక దాడిలో కండ్లు బైర్లు కమ్మేలా నిజాలు బహిర్గతమైనట్టు తెలుస్తున్నది. అందులో అశోక్‌రావు, కమ్రుద్దీన్, చాంద్‌పాషాతోపాటు మరికొంత మంది ఏజెంట్ల ఇండ్లలో సోదాలు చేసినట్టు తెలిసింది. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే దాడులు ప్రారంభించి.. దాదాపు 11 గంటలపాటు నిర్విరామంగా సోదాలు చేయగా, అందులో అనేక చీకటి కుంభకోణాలకు సంబంధించిన పత్రాలు దొరికినట్లుగా తెలుస్తున్నది.

కరీంనగర్, జనవరి 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) / రాంనగర్ : కోరుట్ల కేంద్రంగా కొంత మంది గల్ఫ్ ఏజెంట్లు నకిలీ పాస్‌పోర్టులు ఇప్పిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. అందులో భాగంగా శ్రీలంకతోపాటు బంగ్లాదేశ్ వాసులకు సైతం కోరుట్లలోని పలు చిరునామాల మీద పాస్‌పోర్టులు ఇప్పించారు. అందుకోసం బోగస్ ఆధార్ కార్డులు, స్థానిక సర్టిఫికెట్లు, ఇతర ధ్రువీకరణ పత్రాల కోసం అవసరమైన స్టాంపులు, దస్త్రాలు సృష్టించారు. రెవెన్యూకు సంబంధించి కోరుట్ల రెవెన్యూ అధికారులతోపాటు జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పలు మండలాలకు చెందిన బోగస్ రెవెన్యూ స్టాంపులు తయారు చేసి.. ఈ దందాను నడుపుతున్నట్టుగా తెలుస్తున్నది. అందుకోసం సదరు ఏజెంట్లు భారీగా డబ్బులు వసూలు చేసినట్టు సమాచారం. అలాగే వేరే వారి ఆధార్ నెంబర్ తీసుకొని, సదరు కార్డుపై ఫొటోలు మార్చి.. ఏమాత్రం అనుమానం రాకుండా సదరు కార్డు చిరునామాపై బోగస్ కార్డులు సృష్టించి చిరునామాలు వాడుకున్నారని తెలుస్తున్నది. మొత్తంగా రికార్డుల పరంగా ఎక్కడ డౌట్ రాకుండా సదరు ఏజెంట్లు జాగ్రత పడినట్లుగా సమాచారం. దీంతో.. వారి దందా మూడు పువ్వులు ఆరుకాయల మాదిరిగా జరిగింది. రెండు మూడేళ్లుగా ఈ దందాను నిరాకంటంగా నడుపుతున్నారని సీఐడీ పోలీసులు స్వాధీనం చేసుకున్న బోగస్ పత్రాల ద్వారా తెలుస్తోంది.

పోలీసులకు సంబంధం?

నిజానికి ఒక పాస్‌పోర్టు జారీ కావాలంటే.. చట్టపరంగా చాలా ఎంక్వైరీలుంటాయి. ముందుగా స్పెషల్ బ్రాంచ్‌కు ఆన్‌లైన్‌లో సమాచారం వస్తుంది. వారు దరఖాస్తుదారుడు ఉండే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇస్తారు. ఈ తరుణంలో ఇటు ఎస్‌బీ, అలాగే స్థానిక పోలీసులు పూర్తిగా విచారణ చేస్తారు. ఆన్‌లైన్‌లో ఇచ్చే నివేదిక మేరకే పాస్‌పోర్టులు జారీ చేస్తారు. ఎక్కడ అనుమానం వచ్చినా రిమార్క్ రాయొచ్చు. పోలీసులు ఏమాత్రం అభ్యంతరం తెలిపినా పాస్‌పోర్టులు ఆగిపోతాయి. కానీ, వందలాది పాస్‌పోర్టులు కోరుట్ల నుంచి జారీ అయ్యాయి. అవి కూడా పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయి. ఒకటీ రెండు పత్రాలు కాదు.. సమస్తం బోగస్ పత్రాలు పెట్టి పాస్‌పోర్టులు జారీ అయ్యేలా చూశారు. అయితే ఈ మొత్తం వ్యవహారంలో ఏజెంట్లు చూపిన ఆశకు పోలీసులు సైతం చిక్కారనే అనుమానాలు కలుగుతున్నాయి. ఒక్కో పాస్‌పోర్టుకు ఒక్కో రేటు చొప్పున వసూలు చేసి, అవి బోగస్ అని తెలిసినా.. ఓకే చెప్పారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అదుపులో ఏడుగురు?

సీఐడీ అధికారులు శుక్రవారం కోరుట్లలోని పలువురు ఏజెంట్ల ఇండ్లపై దాడులు చేసి, మొత్తం ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. అందులో ముగ్గురు ఏజెంట్లు కాగా.. మరో నలుగురు ఈ రాకెట్‌తో సంబంధం ఉన్నవారని తెలుస్తున్నది. సదరు వ్యక్తులను ముందుగా కరీంనగర్ తరలించిన సీఐడీ అధికారులు, రాత్రి తిరిగి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. వీరి నుంచి స్వాధీనం చేసుకున్న ల్యాప్‌ట్యాప్‌లు, స్టాంపులు, బోగస్ పత్రాలన్నింటినీ సైతం సీజ్ చేసి తీసుకెళ్లినట్టు తెలిసింది. దాడుల సమయంలో దొరికిన సమాచారం, పలు స్టాంపులు, ల్యాప్‌ట్యాప్‌లో ఉన్న అంశాలను చూసి సీఐడీ అధికారులే నివ్వెరపోయినట్టుగా సమాచారం. అంతేకాదు, బంగ్లాదేశ్, శ్రీలంక వాసులు ఇక్కడి నుంచి పాస్‌పోర్టులు తీసుకునేందుకు ఉపయోగించిన పలు స్టాంపులు, ఇతర సామగ్రిని చూసి.. వాటి గురించి పూర్తి వివరాలు ఆరా తీసినట్టు తెలిసింది. ఇదే సమయంలో బోగస్ పాస్‌పోర్టుల జారీకి సహకరించిన పోలీస్ అధికారులపైనా ఆరా తీస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఈ ఏజెంట్ల వ్యవహారం అంతా కోరుట్ల కేంద్రంగానే నడిచిందా..? లేక ఇతర జిల్లాల నుంచి కూడా నడిచిందా..? అన్న కోణంలోనూ సమాచారం సేకరిస్తున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో సీఐడీ మరింత లోతుగా వెళ్తే.. బాగోతం పూర్తిగా బట్టబయలవుతుంది.

మ్యుటేషన్లకు బ్రేక్..!

- కరీంనగర్ బల్దియాలో మూడు నెలలుగా నిలిచిన ప్రక్రియ
- కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్న దరఖాస్తులు
- కార్యాలయం చుట్టూ తిరుగుతున్న దరఖాస్తుదారులు
- రిజిస్ట్రేషన్ చేసుకుంటేనే పేరు మార్పిడి చేస్తామంటున్న అధికారులు

కరీంనగర్ నగర పాలక సంస్థలో మ్యుటేషన్ల ప్రక్రియ నిలిచిపోయింది. ఇంటి యజమాని చనిపోతే భార్య లేదా పిల్లల పేరిట ఆస్తి మార్పిడి చేయాలంటే కీలకమైన ఈ విధానానికి ఒక్కసారిగా బ్రేక్‌పడింది. సాధారణంగా దరఖాస్తుకు మరణ ధ్రువీకరణ పత్రం, అఫిడవిట్ జత చేసి అందిస్తే పని పూర్తిచేసే అధికారులు, మూడు నెలలుగా దరఖాస్తులను పెండింగ్‌లో పెడుతున్నారు. అప్లికేషన్లు కుప్పలు, తెప్పలుగా పేరుకుపోతుండగా, దరఖాస్తుదారులు ఆఫీసుల చుట్టూ తిరుగుతూ వేసారిపోతున్నారు. అయితే నిబంధనలు మారాయని, రిజిస్ట్రేషన్ చేసుకుంటే మ్యుటేషన్ చేస్తామని అధికారులు స్పష్టం చేస్తుండగా, పాత విధానంలో చేయాలని అర్జీదారులు కోరుతున్నారు.

కరీంనగర్ కార్పొరేషన్, జనవరి 19: ఇంటి యజమాని చనిపోతే భార్య లేదా పిల్లల పేరిట ఆస్తి మార్పిడి చేయాలంటే మ్యుటేషన్ తప్పనిసరి. దరఖాస్తుకు మరణ ధ్రువీకరణ పత్రం, వారుసుల సంతకాలతో నోటరీ జత చేసి అందిస్తే సరిపోతుంది. అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి పేరుమార్పిడి చేస్తుంటారు. కరీంనగర్ బల్దియాలో ఈ ప్రక్రియ ఏండ్లపాటు సజావుగా సాగింది. అయితే, మూడు నెలలుగా అధికారులు దరఖాస్తులను పెండింగ్‌లో పెడుతుండగా, అర్జీదారులు ఇబ్బందులు పడుతున్నారు. నెలలు గడిచిపోతున్నా మ్యుటేషన్ కాకపోవడంతో కార్యాలయాల చుట్టూ తిరుగుతూ వేసారిపోతున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే.. మ్యుటేషన్ కావాలంటే ప్రస్తుతం మరణించిన వ్యక్తి భార్య లేదా వారసుల పేరిట రిజిస్ట్రేషన్ తప్పనిసరని అధికారులు చెబుతున్నారని వాపోతున్నారు. ఇన్నాళ్లూ అడ్డురాని లేని నిబంధనలు ఇప్పుడెలా వచ్చాయని, ఈ విషయంలో ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకొని మ్యుటేషన్లు చేయాలని కోరుతున్నారు.

నిబంధనల మేరకు చేస్తున్నాం..

మ్యుటేషన్ నిబంధనలు మారాయి. మరణించిన వ్యక్తికి సంబంధించిన ఆస్తి భార్య లేదా పిల్లల పేరిట మార్చుకోవాలంటే ఆ ప్రాపర్టీ వాళ్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్న నిబంధనలు ఉన్నాయి. మేం ఆ పద్ధతిలోనే వెళ్లాలని సూచిస్తున్నాం. వాస్తవానికి ఇటీవలి కాలంలో మ్యుటేషన్లన్నీ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లోనే రిజిస్ట్రేషన్ అనంతరం ఆన్‌లైన్‌లోనే జరిగిపోతున్నాయి. ఇంకా మా వద్దకు వచ్చే దరఖాస్తులను వెనువెంటనే పరిష్కరిస్తున్నాం. ఎవరికీ ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూస్తున్నాం.

- స్వరూపరాణి, నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్

కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్

- వచ్చే నెల 15 దాకా దరఖాస్తులకు అవకాశం

కరీంనగర్ తెలంగాణచౌక్, జనవరి 19: తెలంగాణ కార్మిక మండలి ద్వారా కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలను అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని సహాయ కార్మిక కమిషనర్ కోటేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దుకాణాలు, కర్మాగారాలు, మోటరు వాహనాల రిపేరింగ్, వాణిజ్య, సహకార, ధార్మిక సంస్థలు ఇతర ట్రస్టులో చేసున్న కార్మికుల పిల్లలు 2022-2023 సంవత్సరానికి గాను స్కాలర్‌షిప్ పొందడానికి అప్లయ్ చేసుకోవాలని సూచించారు. పదో తరగతి, ఐటీఐ (₹1000), పాలిటెక్నిక్ (₹1500), ఇంజినీరింగ్, మెడిసిన్, లా, బీఎస్సీ, అగ్రికల్చర్, వెటర్నరి, నర్సింగ్, ఎంసీఏ, బీబీఏ, డిప్లొమా ఇన్ మెడికల్ లేబోరేటరీ టెక్నిషయన్‌లో ఉత్తీర్ణులైన వారికి (₹2వేలు) అందిస్తామని చెప్పారు. ఆయా కోర్సుల్లో వచ్చిన మెరిట్ ఆధారంగా ఎంపిక ఉంటుందన్నారు. దరఖాస్తులను వచ్చేనెల 15లోగా కార్మిక శాఖ కార్యాలయంలో అందించాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులకు మేడే నాటికి బ్యాంకు అకౌంట్‌లో జమ చేస్తామని చెప్పారు.

ఓటరు నమోదుకు నేడు, రేపు స్పెషల్ డ్రైవ్

కలెక్టరేట్, జనవరి 19 : ఓటరు నమోదు, జాబితాలో సవరణలు, మార్పులు, చేర్పులు, తొలగింపు కోసం నేడు, రేపు స్పెషల్‌డ్రైవ్ చేపడుతున్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 20, 21 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు, సవరణ శిబిరాలు నిర్వహించనున్నారు. 2024 జనవరి ఒకటి నాటికి 18 ఏండ్లు నిండిన యువత ఓటరుగా నమోదుకు అర్హులు కాగా, స్పెషల్ డ్రైవ్‌పై విస్తృత ప్రచారం చేస్తున్నారు. దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు తమ వివరాలు నమోదు చేసుకునేలా ప్రత్యేక దృష్టి సారించనున్నారు. కాగా, నూతన ఓటరు నమోదు, సవరణలు, తొలగింపుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన 6, 7, 8 దరఖాస్తు ఫారాలు బూత్ స్థాయి అధికారుల వద్ద అందుబాటులో ఉంచారు.

కలిసికట్టుగా పల్లెల అభివృద్ధికి కృషి

- మండలి విప్ భానుప్రసాద్‌రావు
- పెగడపల్లి, ఆరెపల్లిలో అభివృద్ధి పనులు ప్రారంభం
- హాజరైన ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్: ఆరెపల్లిలో నూతన జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

కాల్వశ్రీరాంపూర్, జనవరి19: పల్లెల అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దామని మండలి విప్ భానుప్రసాద్‌రావు పిలుపునిచ్చారు. 'మన ఊరు-మన బడి'లో భాగంగా కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లిలో ₹28.68 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గది, డైనింగ్‌హాల్, ఆరెపల్లిలో ₹20లక్షల ఈజీఎస్ నిధులతో నిర్మించిన జీపీ భవనాన్ని శుక్రవారం ఎమ్మె ల్యే విజయరమణారావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందించామని గుర్తు చేశారు. గ్రామాలు అభివృద్ధి బాట లో పయనిస్తున్నాయని, ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ, పంటలకు ఇబ్బంది లేకుండా సాగునీరందిస్తామని యాసంగి వడ్ల కొనుగోలులో గింజ కటింగ్ కాకుండా చూస్తామన్నారు. మహిళా సంఘ భవనం, జీపీ కాంపౌండ్ వాల్‌కు నిధులు మంజూరుతోపాటు వాటర్ ప్లాంట్ నిర్మిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీని పూలమాల లు వేసి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ నూనేటి సంపత్, జడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, సర్పంచులు పొన్నమనేని దేవేందర్‌రావు, ఆరెల్లి సుజాత రమేశ్, ఎంపీటీ సీ సుముఖం నిర్మల మల్లారెడ్డి, మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్, ఎంపీడీవో రాం మో హనాచారి, ఎంపీవో గోవర్ధన్, ఉప సర్పంచులు గరిడె అశోక్, సుఖేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చొప్పదండి మాజీ ఎమ్మెల్యే భర్త మృతి

- సంతాపం తెలిపిన ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎంపీ వినోద్


గాలన్న (ఫైల్)

చొప్పదండి, జనవరి 19 : చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ భర్త గాలన్న శుక్రవారం మృతిచెందారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నగరంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ తుది శ్వాసవిడిచారు. ఆయన మృతికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్నివ్వాలని కోరారు. బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పని చేశారని, చిన్నతనం నుంచే పేదల సమస్యలపై పోరాడడంతో పాటు వామపక్ష పార్టీల్లో పని చేశారని గుర్తు చేశారు. అలాగే, గాలన్న మృతికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వర్‌రావు, రామడుగు మాజీ జడ్పీటీసీ వీర్ల కవిత సంతాపం తెలిపారు.

సన్నబియ్యం పేరిట మోసం

కోరుట్ల, జనవరి 19: మార్కెట్‌లో సన్నబియ్యానికి డిమాండ్ పెరగడంతో ఇదే అదనుగా కేటుగాళ్లు కొత్త తరహా మోసానికి తెరలేపారు. శుక్రవారం కోరుట్ల పట్టణంలోని బుకవాడకు చెందిన అందె రాధ వద్దకు ఎక్సెల్ వాహనంపై వచ్చిన ఓ కేటుగాడు జై శ్రీరాం బియ్యం తక్కువ ధరకు అమ్ముతామని, నేరుగా రైతుల నుంచి కొ నుగోలు చేసిన మర బియ్యమని నమ్మ బలికాడు. మార్కెట్‌లో ఈ బియ్యం ధర క్వింటాల్‌కు ₹7 వేలు పలుకుతున్నదని, తాము ₹5 వేలకే ఇస్తామని నమ్మించాడు. కేవలం 25కిలోల బియ్యం చాలని మహిళ చెప్పినా వినకుండా మాయ మాటలుచెప్పి క్వింటాల్ రైస్ విక్రయించాడు. బియ్యం బస్తాలో బియ్యం శాంపిల్స్ తీసి చూపడం తో నిజమేనని నమ్మిన ఆ మహిళ క్వింటాల్ రైస్ కొనుగోలు చేసింది. కొద్దిసేపటి తర్వాత బియ్యం సంచు లు విప్పి చూడగా పురుగులు పట్టిన దొడ్డు బియ్యం కనిపించడంతో కంగుతిన్నది. మోసపోయానని గుర్తించి లబోదిబోమన్నది.

రాజన్న క్షేత్రం.. భక్త జన సంద్రం


ఆలయంలో భక్తులు

వేములవాడ టౌన్, జనవరి 19: వేములవాడ రాజన్న ఆలయం శుక్రవారం భక్త జన సంద్రంగా మారింది. రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో కిటకిటలాడింది. ధర్మగుండం, కల్యాణకట్ట వద్ద రద్దీ కనిపించింది. రాయేశుడికి తలనీలాలు సమర్పించిన తర్వాత ధర్మగుండంలో స్నానాలు చేసి క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. అభిషేక, అన్నపూజలు చేశారు. స్వామివారికి ప్రీతికరమైన కోడె మొక్కును చెల్లించుకున్నారు. నిలువెత్తి బంగారాన్ని సమర్పించి భక్తులకు పంచిపెట్టారు. సుమారు 40వేల మంది దర్శించుకున్నారని, ₹16లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు వెల్లడించారు.